


"ఇందాకటినుంచి చూస్తున్నాను. ఆ బ్రూట్ మన వెనకే వస్తున్నాడే" అంది అనంత.

"వస్తే రానీ....నువ్వెందుకు వెనక్కి తిరిగి చూస్తావు" అంది సరిత.

అనంత, సరిత అక్కా చెల్లెళ్ళు ఒకే కాలేజీలో చదువుతున్నారు.

"అదికాదే....నాకెందుకో భయంగా ఉందే కాలేజీ వరకు ఈ గోల తప్పదులాగింది."

"అబ్బబ్బ అయితే ఉండు రిక్షా పిలుస్తా.... ఆ వెంటాపడే మానవుడికి వాహనం లేదు కాబట్టి దెబ్బకి పీడ వదులుతుంది" అని సరిత రిక్షా కేకేస్తూండగానే—

"ఏమండీ....ఏమండీ" అని పిలిచాడు.

"పిలుస్తున్నాడు కూడానే...." అంది అనంత భయం భయంగా.

"వెధవ పిలిస్తే పలుకుతామనుకున్నాడు కాబోలు..రా" అంటూ అనంతతోపాటు రిక్షా ఎక్కింది సరిత.

"ఏమండీ! ఏమండీ!" అన్న అతని మాటలు వాహనాల రొదలో కలిసిపోయాయి.

వెనక్కి తిరిగి చూసిన వారిద్దరూ అప్రతిభులై రోడ్డు మధ్యగా నిల్చున్న అతన్ని చూసేసరికి నవ్వాపుకోలేకపోయారు.

*

"కెమిస్ట్రీ మేడమ్ రాలేదట. ఫీజు కట్టేద్దాం పదవే" సరిత కేకతో బయలుదేరింది అనంత.

ఆఫీస్ రూమ్ దగ్గరకి వచ్చాక పుస్తకాలన్నీ వెదికి "అరే! డబ్బులు కన్పించడం లేదు" కంగారుగా అంది సరిత.

"ఏమిటీ? డబ్బులు కన్పించడం లేదా? ఏ పుస్తకంలో పెట్టావు?"

"బాటనీ టెక్స్టులో పెట్టాను" వెతుకుతూ అంది సరిత.

"చచ్చాంపో! మూడొందలు. రూపాయి కాదు, రెండ్రూపాయలూ కాదు. ఏం చేద్దాం?"

"పోనీ నీ పుస్తకాల్లో చూడు."

"ఉండు. చూస్తాను." కొంతసేపు వెతికిన అనంత "లేవే. ఏం చేద్దాం ఇప్పుడు?" నీరసంగా అంది.

"ఏం చేస్తాం? మూడొందలు హుష్‌కాకి. వుండు క్లర్క్‌తో చెప్పి వస్తాను రేపు కడతామని" ఆఫీస్ రూమ్‌వైపు కదిలింది సరిత.

ఒంట్లో సత్తువంతా ఎగిరిపోయింది అనంతకు. ఈ మూడొందలు సంపాదించడానికి తమ ఇంట్లో వాళ్ళు ఎంత అవస్తపడ్డారో తనకు తెలుసు. సరిత ఎప్పుడూ ఇంతే! ఏ విషయాన్నయినా తేలికగా తీసుకుంటుంది. ఏం చెయ్యాలి ఇప్పుడు? యధాలాపంగా గేటువైపు చూసిన అనంత ఒక్కసారిగా అదిరిపోయింది. 'చచ్చాం అసలే కంగారుగా వుంటే ఈ గొడవొకటి. సరిత కూడా లేదే! ఏం చేయడమా?' అని ఆలోచిస్తున్నంతలో ఇందాకటి యువకుడు దగ్గరకి వచ్చేశాడు. అట్నుంచి సరిత కూడా వచ్చింది.

"పదవే పోదాం! క్లర్క్‌తో చెప్పాను."

ఇంతలో "ఏమండీ" అన్న పిలుపు వినబడడంతో సరిత అటు చూసింది. ఇందాకటి అతను అక్కడ నిలబడి వున్నాడు. సరితకు ఒళ్ళు మండింది. 'ఇందాకట్నించి వెంట పడ్తున్నాడు వెధవ. దులిపేస్తాను.' మనసులో అనుకుంది సరిత.

"ఏం కావాలండీ?"

"మీరు ఏమీ అనుకోనంటే...." అతడు అనుమానంగా ఆగిపోయాడు.

"కాలేజీకొచ్చి ఆడపిల్లతో మాట్లాడుతూ వుంటే ఏమీ అనుకోకుండా ఎలా వుంటాం!" కోపంగా అంది సరిత.

"మీరు అపార్థం చేసుకుంటున్నారు" అతడు కంగారుగా దిక్కులు చూస్తూ అన్నాడు.

తెలుగు సినిమా డైలాగులు మాని మమ్మల్నెందుకు వెంటాడుతున్నారో చెప్పండి" అపహాసంగా అంది సరిత.

"మీరు ఇందాక పిలిస్తే పలకకుండా అలా రిక్షా ఎక్కేశారేమిటండీ?"

"లేకపోతే పిలిచినవాళ్ళందరితో రోడ్డు మీద హస్కేసుకోమంటారా?"

అతడు అనంతవైపు చూశాడు.

హస్కేసుకోమని కాదు వాళ్ళెందుకు పిలిచారో కూడా మీకక్కరలేదా "ఈ సోదంతా అనవసరం. అసలింతకీ తమరెందుకు వచ్చారో చెప్పలేదు" చిరాకుగా అంది సరిత.

"అదే చెప్పబోతున్నాను సిస్టర్స్ ముందు ఈ డబ్బు తీసుకోండి."ఎందుకు? మీరు చెప్పబోయే సోదంతా వినడానికా? మాకు టైం లేదు. రావే అనంతా పోదాం!"

"అబ్బబ్బ మీ గొడవే మీది కానీ నామాట విన్పించుకోరేమిటి" వాళ్ళతో పాటే నడుస్తూ అడిగాడు అతను.

"చూడండి బ్రదర్! మీరు అనవసరంగా మాతో మాట్లాడుతున్నారు. మీరెవరో మాకింత వరకు తెలీదు. ఇంతసేపు మీతో మాట్లాడవలసిన పని కూడా లేదు. మమ్మల్ని విసిగించకుండా మర్యాదగా మీ దోవన వెళ్ళకపోతే ప్రిన్స్‌పాల్‌కి రిపోర్ట్ చెయ్యాల్సి వుంటుంది" తీవ్రంగా అంది సరిత.

"అయితే నాకేం పట్టింది? పోనీకదా అని మీరు పోగొట్టుకున్న డబ్బు మీకిద్దాం అనుకుంటే ఇన్ని మాటలంటారా? అదే ఇంకెవరన్నా అయితే..."

అతని మాట పూర్తి కాకుండానే "ఏమిటీ? మేం పోగొట్టుకున్న డబ్బా?" ఇద్దరూ ఒక్కసారే అడిగారు.

"అవును నేను కొట్టు దగ్గర ఆగి వక్కపొడి కొనుక్కుని వెనక్కి తిరిగేసరికి మీ నోట్ బుక్‌లోంచి ఈ నోట్లు జారి పడ్డాయి. మడత విప్పి చూస్తే మూడొందలున్నాయి. మీకిద్దాం అని పిలుస్తుంటే మీరేమో రిక్షా ఎక్కేశారు. ఇంత దూరం వచ్చి ఇస్తుంటే ఈ మర్యాద నాకు దక్కింది. చాలుగానీ మూడొందలేనా మీరు పోగొట్టుకుంది?" డబ్బు వాళ్ళకిస్తూ అడిగాడతను.

యాంత్రికంగా చెయ్యి చాపి డబ్బు తీసుకుంది సరిత. వెలవెలబోతున్న మొహాలతో 'థాంక్స్' చెప్పకుండా మరచి వెళ్ళిపోతున్న అతడివైపు విభ్రాంతులై చూస్తూండిపోయారు సరిత, అనంత.

—ఎస్. పద్మావతి